ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జనగామ
శనివారం 24 ఆగస్టు 2024

మామునూరు విమానాశ్రయంలో ఏఏఐ సర్వే విమానాలు (ఫైల్)



భూసేకరణే అడ్డు!

మామునూరు విమానాశ్రయానికి భూమి కోసం ప్రభుత్వం కసరత్తు





- ఇప్పటికే 700 ఎకరాల అప్పగింత.. మరో 300ఎకరాలు అవసరమని గుర్తించిన ఏఏఐ
- ఎయిర్‌పోర్టు పరిసర ప్రాంతాల రైతులతో అధికారుల చర్చలు
- భూమికి బదులు భూమి లేదా మార్కెట్ రేటు ఇవ్వాలంటున్న అన్నదాతలు
- నష్టపరిహారం చెల్లింపుపై స్పష్టత ఇవ్వని సర్కారు
- ఇప్పటికే మామునూరులో స్కై అండ్ ల్యాండ్ సర్వే పూర్తి
- 150కిలోమీటర్ల నిబంధన సడలింపుపై 'జీఎంఆర్'తో ప్రభుత్వం చర్చలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్ విమానశ్రాయానికి భూసేకరణే ప్రధాన అడ్డంకిగా మారుతోంది. ఇప్పటికే ఎయిర్‌పోర్టు కోసం 700ఎకరాల భూమిని అప్పగించగా, మరో 300ఎకరాల భూమిని కేటాయించాలని ఎయిర్‌పోర్టు ఆథారటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ప్రభుత్వాన్ని కోరింది. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఉన్న ప్రభుత్వం.. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కావాల్సిన భూసేకరణ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. అయితే భూమికి బదులు భూమి ఇవ్వాలని లేదంటే బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరను చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు రూ.1కోటి నుంచి రూ.2కోట్లకు పైగా ధర ఉంది. దీంతో ప్రభుత్వం రైతులకు చెల్లించే నష్టపరిహారం విషయంలో స్పష్టత ఇవ్వకపోవటంతో ఎయిర్‌పోర్టుకు భూసేకరణ ప్రధాన అడ్డంకిగా మారిందనే చర్చ జరుగుతోంది.

ఎయిర్‌పోర్టుకు సర్వేలన్నీ అనుకూలమే..

2017 ఏప్రిల్ 27న ఉడే దేశ్‌కీ ఆమ్ నాగరిక్ (ఉడాన్) పథకం కింద వరంగల్ ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఓఎల్ఎస్ సర్వే, సాయిల్ టెస్టింగ్‌తో పాటు వివిధ సర్వే సంస్థల నివేదికలతో పాటు టెక్నో ఎకనామికల్ ఫీజిబిలిటీ స్టడీ రిపోర్టును ఎయిర్‌పోర్టు ఆథారటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)పూర్తి చేసి గత 2023 జూలై 7వ తేదీన కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చింది. దీంతోపాటు మరోసారి గత ఏప్రిల్‌లో ఏఏఐ అధికారులు ఓఎల్ఎస్ సర్వేతో పాటు మట్టి పరీక్షలు నిర్వహించారు. మూడు విమానాలతో ఎయిర్ వ్యూ చేపట్టారు. విమానాల రాకపోకలకు వాతవారణం అనుకూలంగా ఉందా లేదా అని పరి శీలించారు. జియాజికల్ సర్వేతో పాటు స్కై అండ్ ల్యాండ్ సర్వే చేపట్టారు. సుమా రు రెండు వా రాల పాటు ఏఏఐ సిబ్బంది మామునూనులోనే మకాం వేసి ఎయిర్ పోర్టు నిర్వహణకు కావాల్సిన అన్ని టెస్టులను సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించారు. ఇక హైదరా బాద్ వి వ రా నా ్ర శ య రా న్ని నిర్వహిస్తున్న జీఎంఆర్ సంస్థతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఒప్పదం మేరకు 150కి.మీ పరిధిలో 2038 వరకు మరో వాణిజ్య విమానాశ్రయం ఉండకూడదనే నిబంధన ఉంది. ఈ నిబంధన ప్రకారం శంషాబాద్ ఎయిర్ పోర్టుకు మామునూరు 145కిలో మీటర్ల లోపే ఉంది. ఈ నిబంధనల సడలింపుపై ప్రభుత్వం అభ్యర్థన మేరకు జీఎంఆర్ నుంచి సానుకూలత వచ్చిందని సమాచారం.



అంతర్జాతీయ స్థాయి విమానాలకు అనుకూలంగా...

'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందంగా మారింది వరంగల్ ఎయిన్‌పోర్టు పరిస్థితి. అన్ని రకాల అనుమతులు, అనుకూలతలు ఉన్నప్పటికి ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు ఏదో ఒక అడ్డంకి ఎదురవుతోంది. గత ప్రభుత్వం మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం ప్రయత్నాలు చేసింది. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కావాల్సిన మరో 438 ఎకరాల భూమితో పాటు రూ.1,200కోట్ల నిధులను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏఏఐ

మిగతా 7వ పేజీలో..

రైతులతో చర్చిస్తున్నాం..

రేవూరి ప్రకాష్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే



మామునూరు ఎయిర్‌పోర్టుకు కావాల్సిన భూమిని ఇచ్చేందుకు రైతులతో చర్చలు జరుపుతున్నాం. ఇప్పటికే సంగెం మండలంలోని పలు గ్రామాల్లో సభలు నిర్వహించాం. భూమికి బదులు భూమి కావాలని రైతులు కోరుతున్నారు. లేదంటే బహిరంగ మార్కెట్ ధర చెల్లించాలని అడుగుతున్నారు. రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే వరంగల్ వాసులకు గగనయానం సాకారం అవుతుందనే నమ్మకం ఉంది.

రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా మోదీ పాలన



- బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది
- దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయి
- సెప్టెంబరు 1నుంచి 7వరకు పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు
- విలేకరుల సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- హనుమకొండలో రెండో రోజూ సాగిన కౌన్సిల్ నిర్మాణ సమావేశాలు

7 లో..

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

- నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి
- నియోజకవర్గ సమీక్షలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జనగామ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు విద్యుత్ అధికారులు కచ్చితంగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ విద్యుత్ శాఖ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు. నియోజకవర్గంలో ప్రస్తుతం ఐదు సెక్షన్లు ఉండగా వాటిని పదికి పెంచాలని, ఇందుకు తగిన ప్రతిపాదనలు తయారు చేయాలని అన్నారు. నియోజకవర్గంలో 220 కేవీ సబ్ స్టేషన్, మరో ఐదు సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేయాలన్నారు. కొత్త కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే మంజూరు చేయాలన్నారు. డీఈలు, ఏఈలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎస్టీ కాలనీల్లో మెరుగైన విద్యుత్ సరఫరాపై మరింత దృష్టి సారించాలన్నారు. ఇళ్ల పైనుంచి వెళ్తున్న హైటెన్షన్ వైర్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని, అందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు విధులు నిర్వర్తించాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయ బావుల వద్ద వేలాడుతున్న తీగల వల్ల రైతులు మృత్యువాత పడుతున్నారని, వీటిపై ప్రధానంగా దృష్టి సారించాలని అన్నారు. విద్యుత్ సరఫరాలో ఎదురయ్యే సమస్యలను వెంటవెంటనే పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో ఎస్ఈ వేణుమాధవ్, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ డీఈలు లక్ష్మీనారాయణ, హుస్సేన్‌నాయక్, అధికారులు విజయ్‌కుమార్, గణేశ్, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

కొలువులకు భద్రతేదీ?



- ఆర్థిక ఇబ్బందుల్లో పాఠశాలల పార్ట్‌టైం స్వీపర్లు
- పర్మినెంట్ చేస్తారని 30 ఏళ్లుగా ఎదురుచూపు
- హైపవర్ కమిటీ వేసినా ఫలితం శూన్యం
- ఏపీలో పాతికేళ్ల క్రితమే క్రమబద్ధీకరణ
- తెలంగాణలో ఇప్పటి వరకు అతీగతీ లేదు

7 లో..



కలెక్టరేట్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం

గవర్నర్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

జనగామ రూరల్, ఆగస్టు 23: ఈ నెల 29న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జిల్లాకు వస్తున్న సందర్భంగా శుక్రవారం ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి కలెక్టరేట్ కార్యాలయం, ఓబుల్ కేశ్వాపూర్‌లోని మినీ ఆడిటోరియాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల మరమ్మతులు, పరిశుభ్రత చర్యలు చేపట్టాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. గవర్నర్ పర్యటనకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాకు చెందిన రచయితలు, కళాకారులు, జాతీయ, రాష్ట్ర పురస్కార గ్రహీతలతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. పరిశీలనలో అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్, జిల్లా అధికారులు ఉన్నారు.

ఆర్ఎంపీ క్లినిక్‌పై అధికారుల దాడులు

- రూ. 25వేల విలువైన మందులు సీజ్



నవాబుపేటలో మందులను సీజ్ చేస్తున్న డ్రగ్ కంట్రోల్ అధికారి

లింగాలఘణపురం, ఆగస్టు 23: లింగాలఘణపురం మండలం నవాబుపేటలో ఎలాంటి అర్హత, అనుమతులు లేకుండా వైద్యం నిర్వహించడంతో పాటుగా ఔషధాలు విక్రయిస్తున్న మృదుల ఆర్ఎంపీ క్లినిక్‌పై శుక్రవారం ఔషధ నియంత్రణాధికారులు దాడులు నిర్వహించారు. డ్రగ్స్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి ఆదేశానుసారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు బాలకృష్ణ, అరవింద్ సంయుక్తంగా నవాబుపేటలోని అలికట్టి కృష్ణ అనే ఆర్ఎంపీ నిర్వహిస్తున్న క్లీనిక్‌పై దాడులు చేశారు. రూ.25 వేల విలువైన 56 రకాల మందులను గుర్తించి సీజ్ చేశారు. నిందితుడు కృష్ణపై సెక్షన్ 18సీ డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్టు 1940 కింద కేసునమోదు చేశారు. కార్యక్రమంలో ఔషధనియంత్రణాధికారులతో పాటుగా వైద్యసిబ్బంది గాయత్రి, నల్ల ఇందిర పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

- అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

జనగామ రూరల్, ఆగస్టు 23: విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ)రోహిత్‌సింగ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువులో ఉత్తమ ఫలితాలు సాధించాలని, క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఆయన వెంట డీఎస్‌వో సరస్వతి, సివిల్ సప్లయీస్ డీఎం హతిరాం, డీటీ శ్రీనివాస్ ఉన్నారు.

554 మంది అర్హులు..

ఇద్దరికే రుణమాఫీ

రూ.2.55 కోట్లకు గాను మాఫీ అయింది రూ.87వేలు

- అక్రమాల పుట్టగా నిడిగొండ పీఏసీఎస్
- సీఈవో తప్పిదాలే కారణం
- మండిపడుతున్న రైతులు



నిడిగొండ పీఏసీఎస్ కార్యాలయం

రఘునాథపల్లి, ఆగస్టు 23: నిడిగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అంతులేని అక్రమాలు బయటపడుతున్నాయి. సొసైటీలో కొందరు రైతులు అప్పులు తీసుకొని చెల్లించినప్పటికీ చెల్లించనట్లు.. మరి కొందరు రైతులు అప్పులు తీసుకోకున్నా తీసుకున్నట్లు.. రికార్డులు సృష్టించి సీఈవో కోట్ల రూపాయల అవినీతికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఫలితంగా ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీ అర్హులైన రైతులకు అందకుండా పోతోంది. నిడిగొండ పీఏసీఎస్ పాలకవర్గంతో పాటు సీఈవో చేసిన తప్పిదాలే ఇందుకు కారణమని తెలుస్తోంది. ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసిన మూడు విడతల నిధుల్లో పీఏసీఎస్‌లోని 554 మంది అర్హులైన రైతులకు సంబంధించి మొత్తం రూ.2.55 కోట్లు రుణమాఫీ కావాల్సి ఉండగా కేవలం ఇద్దరు రైతులకు రూ.87 వేలు మాత్రమే మాఫీ అయ్యాయి. గతంలో తీసుకున్న రుణాలను పూర్తిగా చెల్లించినా, ఇప్పుడు బకాయి ఉన్నట్లు రికార్డులు చూపుతుండడంతో బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



లోన్ డబ్బులు చెల్లించినట్టుగా సృష్టించిన నకిలీ రశీదు

ఒకే ఆధార్ నెంబర్‌పై పలువురికి రుణాలు..

నిడిగొండ గ్రామానికి చెందిన యెలపాటి ప్రభాకర్ రెడ్డి ఆధార్ కార్డు నెంబరు 2574 1514 5930పై ఆయనతో పాటు మరో నలుగురికి సుమారు రూ.2.50 లక్షల రుణం మంజూరయినట్లు రికార్డులలో ఉంది. అదేవిధంగా యెలపాటి కరుణాకర్ రెడ్డి ఆధార్ నంబర్‌పై కూడా మరో నలుగురికి అప్పు ఇచ్చినట్లు చూపించారు. ఈ సొసైటీకి ప్రస్తుతం గంగిడి నర్సింహారెడ్డి చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. గతంలో సీఈవోగా ఉన్న రాజయ్య ఎనిమిది సంవత్సరాల క్రితం పదవీ విరమణ పొందినప్పటికీ అతని స్థానంలో 2016 నుంచి తన కుమారుడు రాజ్‌కుమార్‌ను సీఈవోగా నియమించుకున్నారు. పేరు కొడుకుది..పెత్తనం తండ్రిది అన్న తరహాలో వ్యవహరిస్తూ సొసైటీలో జరుగుతున్న అక్రమాల గుట్టును బయటపడకుండా నెట్టుకొస్తున్నాడు. 30 సంవత్సరాల పాటు సీఈవోగా వ్యవహరించిన రాజయ్యను చైర్మన్‌లు ఎవరూ ప్రశ్నించకపోవడంతో రాజయ్య అక్రమాలకు పాల్పడినట్లు రైతులు చూపిస్తున్న ఆధారాలతో స్పష్టమవుతోంది.

రుణమాఫీతో బయటపడ్డ అక్రమాలు

ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీలో తమ రుణాలు మాఫీ కాకపోవడంతో ఆందోళనకు గురైన రైతులు పీఏసీఎస్ కార్యాలయానికి వెళ్లి విచారించగా, దిమ్మ తిరిగే నిజాలు వెలుగుచూశాయి. రుణం తీసుకొని చెల్లించినప్పటికీ చెల్లించనట్లు, రూ.50 వేలు రుణం తీసుకున్న రైతులు వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకున్నప్పటికీ అసలు వడ్డీతో కలిపి లక్ష రూపాయలకు పైగా అప్పు ఉన్నట్లు రికార్డులు ఉండడంతో కంగుతిన్నారు. ఇలా ఇప్పటివరకు సొసైటీలో రూ.2 కోట్ల వరకు స్వాహా చేసి ఉండవచ్చునని రైతులు ఆరోపిస్తున్నారు.

తప్పుడు రికార్డులు సృష్టించారు..

యెలపాటి కరుణాకర్ రెడ్డి, నిడిగొండ



నిడిగొండ పీఏసీఎస్‌లో నేను పది సంవత్సరాల నుంచి ఎలాంటి రుణం తీసుకోలేదు. అయినప్పటికీ సీఈవో రాజయ్య నాకు రెండు ఖాతాలు ఉన్నట్లు సృష్టించాడు. ఒక ఖాతాలో రూ.30 వేలు, మరొక ఖాతాలో రూ. 10 వేల అప్పు ఉంది. అంతే కాకుండా నా ఆధార్ నంబర్‌పై మరో నలుగురికి లక్ష రూపాయలకు పైగా అప్పు ఉంది. దీంతో నేను ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకులో తీసుకున్న రూ.1.70 లక్షలకు రుణ మాఫీ వర్తించలేదు. కో-ఆపరేటివ్ సొసైటీ ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలకు పాల్పడిన తండ్రీకొడుకులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి.

అక్రమాలకు అడ్డులేకుండా పోయింది..

మాసాన్‌పల్లి సాంతోజీ, నిడిగొండ



నిడిగొండ పీఏసీఎస్‌లో 20 సంవత్సరాల నుంచి అక్రమాలు జరుగుతున్నాయి. ఈ విషయంలో సీఈవో రాజయ్యపై పలుమార్లు కలెక్టర్, డీసీవోకు ఫిర్యాదు చేశాను. రాజయ్య రుణాలు తీసుకోని రైతులను గుర్తించి వారి పేర్ల మీద ఫోర్జరీ సంతకాలతో రుణాలు తీసుకోవడం అలవాటుగా చేసుకున్నాడు. సొసైటీలో గత 20 సంవత్సరాల నుంచి రాజయ్య రూ.2 కోట్ల వరకు రుణాలు తీసుకున్నాడని నాకు అనుమానంగా ఉంది. పీఏసీఎస్ పాలకవర్గం రైతులతో కనీసం సంవత్సరానికి ఒక్కసారైనా సర్వసభ్య సమావేశాలు నిర్వహించకపోవడం వల్లే ఇలాంటి అక్రమాలకు తావిచ్చినట్టయింది. ఇప్పటికైనా కో-.ఆపరేటివ్ సొసైటీకి సంబంధించిన ఉన్నతాధికారులతో పాటు ఎస్‌బీఐ అధికారులు విచారణ జరిపి సొసైటీ డబ్బులను రికవరీ చేయాలి.

ఆర్‌వోఆర్ ముసాయిదాపై చర్చ

జనగామ రూరల్, ఆగస్టు 23: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న నూతన ఆర్‌వోఆర్ ముసాయిదాపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్‌సింగ్ అధ్యక్షతన శుక్రవారం కలెక్టరేట్‌లో చర్చ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టనున్న నూతన ఆర్‌వోఆర్ చట్టం రూపకల్పనలో ప్రజలు, రైతులు, రైతు సంఘాల నాయకులు, సీనియర్ అధికారులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తల నుంచి అభిప్రాయాలు సేకరిస్తామన్నారు. ఈ సందర్భంగా జనగామ ఆర్డీవో కొమురయ్య మాట్లాడుతూ భూముల రికార్డింగ్ అథారిటీ తహసీల్దార్‌లకు ఇవ్వాలని, అప్పీల్ అధికారాలు ఆర్డీవోలకు, రీ అప్పీల్ అధికారాలు కలెక్టర్లకు ఇవ్వాలని, ఆపైన సివిల్ కోర్టును ఆశ్రయించే విధంగా ఉండాలని సూచించారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో వెంకన్న మాట్లాడుతూ ఆర్‌వోఆర్ చట్టం ద్వారా సమస్యలు సులభంగా పరిష్కారం అయ్యే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నూతన ఆర్‌వోఆర్ చట్టాన్ని అందరూ స్వాగతించాలని కోరారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు, రైతులు, సంఘాల నాయకులు

హైకోర్టు న్యాయవాది సాధిక్ అలీ మాట్లాడుతూ భూముల వివరాలను ఆన్‌లైన్‌లో కాకుండా పేపర్‌పై రాసి ఇవ్వాలని, కొంత భూమి శిస్తు పెట్టాలని, అప్పీలుకు 90 రోజుల సమయం కేటాయించాలని, రెవెన్యూ కోర్టులు కాకుండా జ్యుడీషియరీ కోర్టులు రావాలని, 3 నెలల్లో భూముల కేసులను ముగించాలని సూచించారు. సామాజిక కార్యకర్త కిష్టయ్య మాట్లాడుతూ భూములు సర్వే చేశాకే నూతన ఆర్‌వోఆర్ చట్టం ప్రవేశపెట్టాలని, ప్రతీ గ్రామానికి అధికారిని నియమించి సిబ్బంది కొరత లేకుండా చూడాలని అన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

జడ్పీ సీఈవో విద్యాలత

హసన్‌పర్తి, ఆగస్టు 23: మహాత్మా జ్యోతిబా పూలే బాలికల విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన నాణ్యమైన విద్యను అందించాలని జెడ్పీ సీఈవో విద్యాలత అన్నారు. మండలంలోని ఎల్లాపూర్‌లో గల తిమ్మాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే బాలికల విద్యాలయాన్ని శుక్రవారం విద్యాలత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ పరిస్థితిని, ఉపాధ్యాయుల పనితీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కిచెన్, డైనింగ్ హాల్, స్టాక్ రూం, రన్నింగ్, ఆర్‌వో వాటర్, టాయిలెట్స్‌తో పాటు ఇతర వసతులపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతీ ఉపాధ్యాయుడు బాధ్యతాయుతంగా పనిచేసి విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమస్యలు వచ్చినప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులను సమన్వయం చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు మెరుగైన వసతులను సమకూర్చేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులున్నారు.



డైనింగ్ హాల్‌ను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో విద్యాలత

ప్రేమపెళ్లి చేసుకుని ముఖం చాటేశాడు

భర్త, ఆరుగురిపై కేసు నమోదు

భీమదేవరపల్లి, ఆగస్టు 23: మండలంలోని ముల్కనూర్‌లో ప్రేమ వివాహం చేసుకొని ముఖం చాటేసిన భర్తతో పాటు వారి కుటుంబ సభ్యులు ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రికి చెందిన ఉడిపి చంద్రకళను మండలంలోని ముల్కనూర్ గ్రామానికి చెందిన బొల్లంపల్లి రంజిత్ 2018లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. చంద్రకళతో రంజిత్ సుమారు ఏడేళ్ల సహజీవనం చేశాడు. గత నెల జూలై 29న తన ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన రంజిత్.. భార్య చంద్రకళ వద్దకు రావడం లేదు. దీంతో అనుమానం వచ్చిన చంద్రకళ ముల్కనూర్‌లోని అత్తాగారి ఇంటికి వచ్చి తన భర్త రంజిత్ కోసం వాకప్ చేసింది. రూ. 50 లక్షల కట్నం ఇవ్వాలని చంద్రకళను భర్త రంజిత్, అత్తామామలు రామచంద్రం- కనకలక్ష్మి, ఆడబిడ్డలు రమాదేవి, ధనలక్ష్మిలు బెదిరిస్తున్నారు. దీంతో చంద్రకళ పోలీసులకు ఫిర్యాదు చేయగా, భర్త రంజిత్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు రామచంద్రం, కనకలక్ష్మి, బొల్లంపలి రాజు, రమాదేవి, ధనలక్ష్మిలపై కేసు నమోదు చేసినట్లు ముల్కనూర్ పోలీసులు తెలిపారు. రంజిత్ పరారీలో ఉన్నాడు.

రికార్డుల్లో ఎక్కువ..

హాస్టల్‌లో ఉన్న విద్యార్థుల సంఖ్య తక్కువ

అధికారుల తనిఖీలో గుట్టు రట్టు

ఆత్మకూరు, ఆగస్టు 23: హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నా.. రికార్డులో మాత్రం విద్యార్థుల సంఖ్యను ఎక్కువగా చూపిస్తున్న విషయం అధికారుల తనిఖీల్లో బయటపడింది. వివరాల్లోకి వెళితే.. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో ఎస్సీ బీసీ రెండు హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో 43 మంది విద్యార్థులు ఉన్నట్లు రికార్డుల్లో పేర్లు ఉన్నాయి కానీ రెండు హాస్టల్‌లో కేవల 17 మంది విద్యార్థులు ఉన్నారని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, నాయిని జగన్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టర్ ప్రావీణ్య ఆదేశానుసారం రెండు హాస్టల్‌లను ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్ జగన్మోహన్‌రెడ్డి, ఆర్ఐ రవీందర్‌రావు ఆకస్మిక తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించారు. హాస్టల్‌లో విద్యార్థులకు సరైన వసతులు లేకపోవడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా లేని విషయాలను గుర్తించారు. ఈ విషయాలను జిల్లా కలెక్టర్ కు నివేదికను సమర్పిస్తామన్నారు. సరైన వసతి లేకపోవడంతో విద్యార్థులు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లిపోతున్నట్లు విద్యార్థులు తెలిపారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

'అడ్డగోలు రిజిస్ట్రేషన్ల'పై విజిలెన్స్ ఆరా


- రంగంలోకి అధికారులు.. వెలుగులోకి మరిన్ని అక్రమాలు
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో ప్రకంపనలు



రాంనగర్, ఆగస్టు 23 : వరంగల్ రూరల్, ఖిలా వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 'నిబంధనలు మరిచి అడ్డగోలు రిజిస్ట్రేషన్లు' చేశారన్న అంశంపై విజిలెన్స్ అధికారులు ఆరా తీశారు. 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన కథనం రిజిస్ట్రేషన్ శాఖలో తీవ్ర ప్రకంపనలు రేపింది. ఈ రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు జిల్లాలోని మిగిలిన కార్యాలయాల్లో పరిస్థితంతా గప్‌చుప్‌గా మారినట్లు తెలిసింది. ఇటీవల బదిలీపై వచ్చిన ఉద్యోగులు భయం భయంగా విధులు నిర్వహించినట్లు సమాచారం. ఎవరితో మాట్లాడితే ఏమవుతుందో అనే అనుమానంతో మౌనంగానే విధులు నిర్వహించి వెళ్లినట్లు తెలిసింది. కాగా బదిలీపై వెళ్లిన ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు నిబంధనలు విస్మరించి నాన్ లేఅవుట్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసి అందినకాడికి దండుకున్నారనే విషయమై విజిలెన్స్ అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. రెండు కార్యాలయాల్లో గత ఆరు నెలల్లో జరిగిన ఆస్తుల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన వివరాలు సేకరించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. సోమవారం రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని రికార్డులను పరిశీలించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

వెలుగులోకి మరిన్ని అక్రమాలు

కాగా వరంగల్ రూరల్, ఖిలా వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు పరకాల, మహబూబాబాద్, ములుగు కార్యాలయాల్లో నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్‌లు జరిగినట్లు తెలిసింది. నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లతో పాటు పహాణీలతో రిజిస్ట్రేషన్లు చేసినట్టు తెలిసింది. పూర్వీకులు అమ్ముకున్న స్థలాలను కుటుంబ సభ్యులు విక్రయించడం లాంటి రిజిస్ట్రేషన్లు చేశారని, వరంగల్ రూరల్ కార్యాలయంలో కొద్దిరోజులు ఇన్‌చార్జ్‌గా బాధ్యతల్లో ఉన్న ఒక అధికారి వరంగల్ ప్రాంతంలో అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారని సమాచారం. ఈ అధికారి నిబంధనలు తుంగలో తొక్కి పహాణీలతో రిజిస్ట్రేషన్లు చేశాడనే ఆరోపణలున్నాయి. పరకాలలో కూడా నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు, పార్ట్ రిజిస్ట్రేషన్లు భారీగానే జరిగినట్లు తెలిసింది. ఈ దందాలో పెద్ద మొత్తంలో కాసులు చేతులు మారినట్లు తెలుస్తుండగా ఇటీవల ఏసీబీకి పట్టుబడిన సబ్ రిజిస్ట్రార్ హయంలో జరిగిన రిజిస్ట్రేషన్లు పరిశీలిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశమున్నట్లు చర్చ జరుగుతోంది. ఇక మహబూబాబాద్, ములుగు కార్యాలయాల పరిధిలో నాన్ లేఅవుట్ వెంచర్లకు సంబంధించిన ప్లాట్ల రిజిస్ట్రేషన్లు పెద్ద ఎత్తున జరిగినట్లు తెలుస్తుండగా గతేడాది కాలంగా ఈ దందా విచ్చలవిడిగా జరిగినట్టు సమాచారం. అధికారులు వరంగల్ రూరల్, ఖిలా వరంగల్, పరకాల, మహబూబాబాద్, ములుగు కార్యాలయాల్లోని రికార్డులు పరిశీలిస్తే మరిన్ని అక్రమ రిజిస్ట్రేషన్ల బాగోతం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



మన్‌సాన్‌పల్లి పాఠశాలను శుభ్రం చేస్తున్న పార్ట్‌టైం స్వీపర్ పర్వరాములు

కొలువులకు.. భద్రతేదీ?

- ఆర్థిక ఇబ్బందులతో పార్ట్‌టైం స్వీపర్లు
- పర్మినెంట్ చేస్తారని 30ఏళ్లుగా ఎదురుచూపు
- హైపవర్ కమిటీ వేసినా ఫలితం శూన్యం
- ఏపీలో పాతికేళ్ల క్రితమే క్రమబద్ధీకరణ
- తెలంగాణలో ఇప్పటివరకు అతీగతీ లేదు

బచ్చన్నపేట, ఆగస్టు 23: మంచి రోజులు రాకపోతాయా.. దశ మారకపోతుందా.. అని పార్ట్ టైమ్ స్వీపర్లు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. ఎప్పటికైనా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొందుతామని, కనీస వేతనం అందుతుందని 30 ఏళ్లకు పైగా చాకిరీ చేస్తున్నారు. చాలీచాలని జీతంతో ఇబ్బందులు పడుతూ బతుకుబండిని నెట్టుకొస్తున్నారు. రాష్ట్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో దశాబ్దాలుగా పని చేస్తున్న పార్ట్‌టైం స్వీపర్ల దుస్థితి ఇది. వీరిలో ఇప్పటికే అనేక మంది మృతి చెందగా, కొందరు రిటైర్ అయ్యారు. 1983లో పార్ట్‌టైం స్వీపర్లుగా ఆంధ్ర, తెలంగాణాలో ఒకేసారి నియామకం అయినప్పటికీ 1994లో అక్కడి వారిని పర్మినెంట్ చేశారు. కాని తెలంగాణలో ఇప్పటి వరకు మోక్షం కలగలేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే తమ బతుకులు బాగుపడతాయని ఆశించినప్పటికీ వారికి నిరాశే ఎదురైంది. మొదట్లో వీరికి నెలకు రూ. 150 జీతం వచ్చేది. అతి తక్కువ జీతమైనప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో కొలువు అన్న భావనతో పని చేస్తున్నారు. పర్మినెంట్ అయితే జీతం పెరుగుతుందని ఆశతో జీవిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 500 మంది ప్రస్తుతం పనిచేస్తున్నారని సంఘం నేతలు చెబుతున్నారు. వారిలో జనగామ జిల్లా నుంచి 35 మంది ఉన్నారు.

హైపవర్ కమిటీ వేసినా ఉపయోగం లేదు..

వేతనాలు పెంచాలని, పర్మినెంట్ చేయాలని పార్ట్‌టైం స్వీపర్లు చేసిన ఆందోళనలతో 1992లో అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి వారిని పర్మినెంట్ చేసేందుకు హైపవర్ కమిటీ వేశారు. ఏవీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కమిటీ స్వీపర్ల క్రమబద్ధీకరణకు అనుకూలంగా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. వీరి వేతనాన్ని స్థిరీకరించి టైమ్ స్కేల్ ఇవ్వాలని ఆదేశించింది. కాని, ఈ ఉత్తర్వులు అమలు కాకపోవటంతో హైకోర్టుకు వెళ్లారు. దీంతో ఈ విషయంలో ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జీవోఎంఎస్ నెం.212 ద్వారా 1994 ఏప్రిల్ 22న ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో స్వీపర్లు ఇక తమ కష్టాలు గట్టెక్కినట్టేనని సంబరాలు చేసుకున్నారు. కాని ఆంధ్ర ప్రాంతంలో పని చేసిన అధికారులు అక్కడ పనిచేస్తున్న పార్ట్‌టైం స్వీపర్లను పర్మినెంట్ చేశారు. వారు ప్రస్తుతం రూ.20 వేల జీతం పొందుతున్నారు. కానీ తెలంగాణలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. తర్వాత తమ సమస్యలు పరిష్కరించాలని 2007లో చలో సీఎం కార్యక్రమం నిర్వహించి అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఎదుట తమ గోడును వెళ్లబోసుకున్నారు. అయినా స్పందన లేకపోవడంతో మానవ హక్కుల సంఘాన్ని సైతం ఆశ్రయించారు. దీంతో వారికి అనుకూలంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, ఆర్థిక శాఖల అధికారులను సంఘం ఆదేశించింది. వీరి వివరాలు తెప్పించుకున్న అధికారులు అంతటితోనే చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం నెలకు రూ. 5200 ల వేతనంతో జీవితం గడుపుతున్నారు. పార్ట్ టైం స్వీపర్లు పనిచేస్తున్న పాఠశాలల హెచ్‌ఎంలు అటెండెన్స్ పత్రాలను ఎంపీడీవోకు ప్రతీనెల పంపిస్తే వారు బిల్లులు చేసి ఎస్‌టీవోకు పంపుతారు. మూడు మాసాలు, ఆరు మాసాలకోమారు జిల్లా పరిషత్ నుంచి వచ్చే కాంటిన్‌జెన్సీ నిధులు జమచేస్తే వీరికి జీతాలు ఖాతాల్లో పడుతాయి. ఇప్పటికైనా ప్రభుత్వం తమ బాధను అర్థం చేసుకుని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనాలు అమలు చేయాలని స్వీపర్లు కోరుతున్నారు.

ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలి

- గూడముల అయోధ్య, పార్ట్‌టైం స్వీపర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



తెలంగాణ రాష్ట్రం వచ్చాక మా బతుకులు మారుతాయనుకున్నాం. కాని, మమ్మల్ని పర్మినెంట్ చేయటంలో కేసీఆర్ ప్రభుత్వం శ్రద్ధ చూపలేదు. 1983 నుంచి అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రస్తుతం పని చేస్తున్నావారిని పర్మినెంట్ చేయడంతో పాటు మృతి చెందిన వారి కుటుంబాలకు, రిటైర్ అయిన వారి కుటుంబాలకు ఉపాధి కల్పించి ఆదుకోవాలి.

కట్య్రాల బడిలో 35 ఏళ్లు పనిచేశా..

- బాలమల్లయ్య, రిటైర్డ్ పార్ట్‌టైం స్వీపర్, కట్య్రాల



కట్య్రాల ప్రైమరీ పాఠశాలలో 35 ఏళ్లు పనిచేశా. ప్రారంభంలో రూ. 150 జీతం ఇచ్చేవారు. రిటైర్‌మెంట్ సమయానికి రూ. 4 వేలు చేశారు. ఉద్యోగంలో చేరే సమయంలో కొద్ది రోజుల్లోనే పర్మినెంట్ చేస్తామన్నారు. ఇప్పటి వరకు అమలు చేయలేదు. అనేక సార్లు ఆందోళనలు చేశాం. కోర్టుకు వెళ్లాం. అయినా మా బతుకులు మారలేదు. మంచి రోజులు రాకపోతాయా అని ఎదురు చూస్తూ మా జీవితాలను బజారున పడేసుకున్నాం. ప్రస్తుతం పనిచేస్తున్న వారికైనా ప్రభుత్వం న్యాయం చేయాలి.

సీఆర్‌పీఎఫ్ వాహనం నుంచి కిందపడ్డ కార్బన్ వెపన్

- ఆయుధాన్ని పోలీస్ స్టేషన్‌లో అందజేసిన ఆటోడ్రైవర్
- సీఆర్‌పీఎఫ్ సిబ్బందికి గన్‌ను అప్పగించిన పోలీసులు

మట్టెవాడ, ఆగస్టు 23: వరంగల్ ఎంజీఎం జంక్షన్ సమీపంలో సీఆర్‌పీఎఫ్ ట్రక్ వాహనం నుంచి కార్బన్ వెపన్ ఎంజీఎం జంక్షన్ సమీపంలో కిందపడిపోయింది. అదే సమయంలో అటు వైపు నుంచి వస్తున్న ఆటో డ్రైవర్ గమనించి ఆ ఆయుధాన్ని మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో అప్పగించిన ఘటన వరంగల్‌లో చోటు చేసుకుంది. వరంగల్ మట్టెవాడ సీఐ గోపి కథనం ప్రకారం.. శుక్రవారం ఉదయం 5 గంటల సమయంలో భీమారంలోని సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ మణిపూర్‌కు వెళ్లేందుకు ప్రత్యేక వాహనాల్లో సిబ్బందితోపాటు ఆయుధాలను వరంగల్ రైల్వేస్టేషన్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో వాహనం నుంచి సీలింగ్ ఊడిపోయి కార్బన్ వెపన్ కింద పడిపోయింది. అదే సమయంలో పైడిపల్లికి చెందిన ధరావత్ శ్రీను ఆటో నడుపుకుంటూ వెళ్తుండగా, ఓ షోరూం ఎదురుగా ఉన్న రోడ్డుపై ఆయుధం ఉండడాన్ని గుర్తించాడు. వెంటనే అతడు మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ ధర్మనాయక్‌కు అప్పగించారు.

కొంత సమయం తర్వాత సీఆర్‌పీఎఫ్ సిబ్బంది వెపన్ వెతుకుతున్న క్రమంలో స్టేషన్‌లో అప్పగించినట్లు తెలుసుకున్నారు. దీంతో బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ రాజేష్‌కుమార్ పోలీసు స్టేషన్‌కు చేరుకొని విషయం వెల్లడించగా వారు ఆయుధాన్ని అప్పగించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీరకం)	2711	2572
పల్లికాయ(పచ్చిది)	3900	3200
పల్లికాయ(సూక)	5900	5000
పెసర	5855	5155
పత్తి	7410	5000
పసుపు(కాడి)	12223	12223
పసుపు(గోల)	12226	12226
తేజ మిర్చి	12000	8500
తేజ ఏసీ	18000	15000
వండర్‌హాట్ ఏసీ	14800	11000
యూఎస్341 ఏసీ	14500	11000
తాలు మిర్చి	6000	3000

రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా మోదీ పాలన

- బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది
- విలేకరుల సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శులు నారాయణ
- హనుమకొండలో రెండో రోజూ సాగిన కౌన్సిల్ నిర్మాణ సమావేశాలు



వయనాడ్ బాధితుల కోసం డి.రాజాకు చెక్కు అందిస్తున్న నాయకులు

బాలసముద్రం, ఆగస్టు 23 : నరేంద్రమోదీ ఎన్నికల్లో గెలిచినా నైతికంగా ఓడిపోయారని, ఆయన పాలన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా సాగుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. హనుమకొండలోని హరితకాకతీయ హోటల్‌లో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందన్నారు. 'దేశంలోని మహిళలకు న్యాయం చేస్తాం.. సబ్ కే సాత్.. సబ్ వికాస్' అని ప్రకటించిన మోదీ ప్రభుత్వం తమ నినాదాన్ని మార్చుకుని తమతో ఎవరుంటే.. వారితో తాముంటాం అనే కొత్త నినాదాన్ని అమలు చేస్తోందని ఆరోపించారు. దేశంలో మహిళలకు రక్షణ లేదని, వివిధ రాష్ట్రాల్లో మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయని విమర్శించారు. బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాలలో కేంద్రం ద్వారా నామినేట్ చేయబడిన గవర్నర్లతో రాజ్యాంగ, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన సాగుతోందని, ఏపీ సీఎం చంద్రబాబు, నితీష్‌కుమార్ మద్దతు ఇవ్వకుంటే కేంద్ర ప్రభుత్వం పడిపోతుందన్నారు. దేశంలో సీబీఐ సంస్థ అత్యంత పవర్‌ఫుల్ సంస్థ అని ఆ సంస్థ అదానీ చేతిలోకి వెళ్లిందని విమర్శించారు. దేశంలోని బీజేపీ వ్యతిరేక పార్టీలు అధికారంలో ఉన్న తమిళనాడు, కేరళ, ఢిల్లీ, కర్నాటక సీఎంలను సీబీఐ సంస్థలతో ఇబ్బందులకు గురి చేసిందన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మధ్య దూరం పెరిగిందని, ప్రధాని మోదీ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు జాతీయ స్థాయిలో ఉన్న ఇమేజ్‌ను వాడుకుని దేశంలో రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా పాలన చేస్తున్నారన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, అమరావతికి రూ.వేల కోట్ల నిధులు ప్రపంచ బ్యాంకుల నుంచి అప్పులు ఇప్పించి మోదీ చంద్రబాబును పావుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ తీర్పును సీపీఐ స్వాగతిస్తున్నట్లు నారాయణ తెలిపారు. వర్గీకరణకు క్రీమీలేయర్‌కు సంబంధంలేదని, రాష్ట్రంలో ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే బీజేపీలో బీఆర్‌ఎస్ విలీన మవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతుండగా, రేవంత్ బీజేపీలో చేరుతారని బీఆర్‌ఎస్ నాయకులు అంటున్నారన్నారు. రెండు పార్టీ లు రాజకీయ క్రీడ ఆడుతున్నారని, ప్రజలకు కావాల్సింది, అభివృద్ధి, సంక్షేమం అని నారాయణ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలన సరిగ్గా చేసుకోవాలని హితవు పలికారు. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపో యాయని ధరల నియంత్రణ డిమాం డ్ చేస్తూ సెప్టెంబరు 1 నుంచి 7వరకు సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తున్నామని, ఈ ప్రజా పోరాటాలలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ, సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా మాట్లాడుతూ ప్రజలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం అనేక చట్టాలను తీసుకువచ్చిందని, ప్రజలకు, ప్రజాస్వామిక వాదులతో చర్చించకుండా ఇటీవల న్యాయ చట్టాలు రూపొందిం చిందన్నారు. దేశంలో విద్యా, వైద్యం పేద ప్రజలకు అందడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, పల్లా వెంకట్‌రెడ్డి, పశ్యపద్మా, కలవేణ శంకర్, ఎం. బాలనరసింహా, బి. విజయసారథి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వయనాడు బాధితులకు సీపీఐ తెలం గాణ సమితి నుంచి రూ.5.41లక్షల ఆర్థిక సహాయాన్ని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాకు రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అందించారు.



మాట్లాడుతున్న ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్, చైర్మన్ కరుణాకర్‌రెడ్డి

ఏకశిల ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతం

వరంగల్ మెడికల్, ఆగస్టు 23 : తెలంగాణలో (హైదరాబాద్ మినహా) తొలి కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సను హనుమకొండలోని ఏకశిల ఆస్పత్రిలో విజయవంతంగా నిర్వహించినట్లు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్, చైర్మన్ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఏకశిల హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో శస్త్ర చికిత్సకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాయపర్తి గ్రామానికి చెందిన గాదె విజయ్ కుమార్ గత ఏడు సంవత్సరాలుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. గత మూడు సంవత్సరాలుగా డయాలసిస్‌పై ఉండగా హాస్పిటల్‌లోని నెఫ్రాలజిస్టు డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి, డాక్టర్ నవీన్ కుమార్‌ల సూచన మేరకు డయాలసిస్ టెక్నికల్ మేనేజర్ రమేశ్ ప్రోద్బలంతో కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. పేషంట్ భార్య ఉమాదేవి కిడ్నీని దానం చేసింది. ఈ క్రమంలో భార్యాభర్తలిద్దరిని వైద్య బృందం సునిశితంగా పరీక్షించి శస్త్ర చికిత్సకు వెళ్లవచ్చని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ శస్త్ర చికిత్సలో ట్రాన్స్‌ప్లాంట్ యూరాలజిస్టు డాక్టర్ ఎస్.జయరాంరెడ్డి, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి, డాక్టర్ శివకుమార్, నెఫ్రాలజిస్టు డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి, డాక్టర్ నవీన్‌కుమార్, అనస్థీషియా డాక్టర్ వి.రమేశ్‌ల ఆధ్వ ర్యంలో ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా చేసినట్లు తెలిపారు. శస్త్ర చికిత్స అనంతరం పేషంట్‌తోపాటు కిడ్నీ దాత ఇద్దరు ఆరోగ్యంగా ఉన్నట్లు వివరిం చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, డాక్టర్లు, వైద్య బృందం, హాస్పిటల్ ఆర్‌ఎంవో డాక్టర్ వెంకట్‌రెడ్డి, జనరల్ మేనేజర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 23: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం యార్డు బంద్, ఆదివారం సాధారణ సెలవు, సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని సెలవు ప్రకటించినట్లు కార్యదర్శి ఆ ప్రకటనలో తెలిపారు. మంగళవారం మార్కెట్లో క్రయవిక్రయాలు యథావిధిగా నిర్వహించబడుతాయని, రైతులు, వ్యాపారులు, కార్మికులు గమనించి మార్కెట్ కమిటీకి సహకరించాలని కోరారు.

మెట్టుగుట్ట ఆలయ అర్చకుడిపై ఫిర్యాదులు

విచారణ చేపట్టిన డిప్యూటీ కమిషనర్?

వరంగల్ కల్చరల్, ఆగస్టు 23 : మడికొండ మెట్టుగుట్టలోని మెట్టు రామలింగేశ్వర దేవాలయం ఆలయ అర్చకుడిని శుక్రవారం జిల్లా సహాయ కమిషనర్ రాయల సునీతతో క లిసి ఆలయానికి చేరుకొని విచారణ చేపట్టినట్లు సమాచారం. డబ్బులు వసూలు చేయడమేకాక, డబ్బున్న వారికే ప్రాధాన్యమిస్తున్నారంటూ భక్తులు దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతారావుకు అర్చకుడు అభిలాష్‌శర్మపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఆలయానికి చేరుకొని దేవాదాయ శాఖ ఆలయ క్లర్క్ భాస్కర్‌పై కూడా ఆరోపణలు ఉన్న నేపథ్యంలో డీసీ భక్తులను అర్చకుడిని, క్లర్క్‌ను విచారించినట్లు తెలిసింది.

అనారోగ్యంతో కొడుకు మృతి..

- తట్టుకోలేక ఆగిన సవతితల్లి గుండె
- మహబూబాబాద్‌లో విషాద ఘటన

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 23 : తన కడుపున పుట్టకపోయినా.. కన్నవారితో సమానంగా ఆ కుమారుడిని సాకింది ఆ తల్లి. సవతితల్లి అనే మాటే కానీ పిల్లలను పెంచే విషయంలో ఎక్కడా సొంత తల్లి లేని లోటును కనిపించకుండా పెంచి పోషించింది. అలాంటి ఆ తల్లి అనారోగ్యంతో మృతి చెందిన కుమారుడి మృతదేహంపై పడి రోదిస్తూ ప్రాణాలొదిలిన విషాద సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు శనిగపురంలో శుక్రవారం జరిగింది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.

శనిగపురం గ్రామానికి చెందిన మంద వెంకన్న రైల్వే ట్రాక్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వెంకన్న భార్య స్వరూప 30 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటికే వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. భార్య చనిపోవడంతో వెంకన్న పిల్లల ఆలనాపాలన కోసం చిన్న గూడూరు మండలం జయ్యారానికి చెందిన జ్యోతి (50)ని రెండో వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత జ్యోతి ఆ ముగ్గురు పిల్లల బాగోగులు చూసుకునేది. ఈ క్రమంలోనే వెంకన్న, జ్యోతికి ఓ కుమారుడు, కుమార్తెకు జన్మించారు. అయినప్పటికి జ్యోతి ఐదుగురు పిల్లలను తారతమ్యం లేకుండా పెంచి పెద్ద చేసింది. మొత్తం ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులకు వివాహాలు చేసింది. ఏడాది క్రితం వెంకన్న కూడా చనిపోవడంతో జ్యోతి ఖమ్మంలోని తన కూతురు వద్ద ఉంటోంది. ఈ క్రమంలో వెంకన్న మొదటి భార్య కుమారుడు రవి (32) శనిగపురంలో ఆటో నడుపుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కానీ, ఇటీవల కాలంలో మద్యానికి బానిసైన రవి తరచూ గొడవపడటంతో అతడి భార్య స్వప్న నాలుగు నెలల క్రితం నెల్లికుదురు మండలం ఆలేరు గ్రామంలోని తన తల్లిగారింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మానసికంగా కుంగిపోయిన



మంద రవి (ఫైల్)



జ్యోతి (ఫైల్)

రవి అనారోగ్యం పాలై గురువారం సాయంత్రం మృతి చెందాడు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులు ఖమ్మంలో ఉన్న సవతితల్లి జ్యోతికి సమాచారం అందించారు. శుక్రవారం ఉదయం శనిగపురం చేరుకున్న జ్యోతి రవి మృతదేహంపై పడి గుండెలవిసేలా రోదించింది. ఈ క్రమంలోనే గుండెపోటుకు గురై కొడుకు మృతదేహంపైనే అపస్మారక స్థితిలో పడిపోవడంతో కుటుంబసభ్యులు స్థానిక వైద్యుడికి చూపించారు. అయితే అప్పటికే జ్యోతి మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం కుటుంబసభ్యులు రవి అంత్యక్రియలను నిర్వహించి.. జ్యోతి మృతదేహాన్ని ఆమె పుట్టినిల్లయిన చిన్న గూడూరు మండలం జయ్యారానికి తరలించి, అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు రవికి భార్య స్వప్న, నాలుగేళ్ల కుమారుడు నవనీత్‌కుమార్ ఉండగా.. నాలుగేళ్ల నవనీత్ కుమార్ తండ్రికి తలకొరివి పెట్టడం చూసి స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇక తనకు పుట్టక పోయినా చిన్నప్పటి నుంచి ప్రేమగా పెంచి పోషించిన కుమారుడు ఇలా చనిపోవడాన్ని జీర్ణించుకోలేకపోయిన జ్యోతి అతడి మృతదేహంపై పడి మృతి చెందడం తమను కలిచివేసిందని కుటుంబసభ్యులు, గ్రామస్థులు చెబుతున్నారు.



రమేష్ అంతిమసంస్కారాలు నిర్వహిస్తున్న చిన్నారి నవనీత్

భూసేకరణే అడ్డు!

5వ పేజీ తరువాయి

కోరింది. అయితే గత ప్రభుత్వం రూ.520కోట్ల నిధులతో పాటు 253 ఎకరాల భూమిని కేటాయించేందుకు ముందుకు వచ్చింది. దీనికి సంబంధించి 2023 ఆగస్టు నెలలో జీవో ఎంఎస్ నెం.36ని జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను ఏఏఐ పరిగణనలోకి తీసుకోకపోవటం, భూసేకరణ, నిధులు విడుదల చేయటంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో విమానాశ్రయం పనులు 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అనే చందంగా మారింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మామునూరు ఎయిర్‌పోర్టుపై దృష్టి పెట్టింది. దీంతో రంగంలోకి దిగిన ఏఏఐ అధికారులు మామునూరులో ఉన్న పాత 1.8కి.మీ రన్‌వేను పరిశీలించారు. అంతర్జాతీయ స్థాయిలో విమనాలు నడిపించేందుకు అనుకూలంగా ఉండేలా ప్రస్తుతం ఉన్న 1.8కి.మీల రన్‌వేను 3.9కి.మీలకు పెంచాలని ఏఏఐ అధికారులు సూచించారు. ఇప్పటికే పైలట్, సిబ్బంది, టెర్మినల్స్‌తో పాటు సుమారు 694ఎకరాల వరకు భూమి ఉంది. కనీసం మరో 306 ఎకరాల భూమిని కేటాయిస్తే పెద్ద విమానాలు నడిపించేలా రన్‌వేను నిర్మించవచ్చునని ఏఏఐ అధికారులు ప్రభుత్వానికి సూచించారు. వరంగల్ ఎయిర్‌పోర్టుకు అంతర్జాతీయ స్థాయిలో విమానాలను నడిపించేందుకు కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నట్లుగా అధికారులు నిర్ధారించినట్లుగా సమాచారం.

భూసేకరణే ప్రధాన అడ్డంకి..

వరంగల్ ఎయిర్‌పోర్టుకు ప్రధానంగా భూసేకరణే అడ్డంకిగా మారుతోంది. నిజాం కాలంలో 1,875ఎకరాల భూమిని ఎయిర్‌పోర్టు కోసం కేటాయించారు. అయితే ప్రస్తుతం ఇందులో నుంచి జవహర్ నవోదయ విద్యాలయానికి 23.20ఎకరాలు, పోలీస్ శిక్షణ కళాశాలకు 59ఎకరాలు, ఏసీపీ కార్యాలయానికి 10ఎకరాలు, వరంగల్ సెంట్రల్ జైలుకు 101ఎకరాలు, ఫోర్త్ బెటాలియన్‌కు 241.24ఎకరాలు, మరో 675 ఎకరాల భూమిని వెటర్నరీ యూనివర్సిటీకి కేటాయించారు. రోడ్డు, ఇతర వాటికి పోగా ప్రస్తుతం 696ఎకరాల స్థలం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధీనంలో ఉంది. అయితే ఎయిర్‌పోర్టుకు 1,200ఎకరాల భూమి అవసరం కాగా, కనీసం వెయ్యి ఎకరాల భూమి అయినా ఇవ్వాలని కేంద్ర విమానాయశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇంకా 304ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. జూన్ 29న వరంగల్ పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణంపై అధికారులతో చర్చించారు. ఏఏఐ అధికారులతో ప్రభుత్వం జరిపిన చర్చల మేరకు త్వరగా ఎయిర్‌పోర్టుకు భూమి కేటాయించాలని రెవెన్యూ అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దీంతో వరంగల్ జిల్లా కలెక్టర్‌తో పాటు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో సంగెం మండలంలోని గుంటూరుపల్లి, నక్కలపల్లి, గడపల్లి, మామునూరు గ్రామాల్లో భూసేకరణ కోసం గ్రామసభలు నిర్వహించారు. ఎయిర్‌పోర్టుకు కావాల్సిన భూమిని రైతుల నుంచి 259ఎకరాల వరకు సేకరించాలని నిర్ణయించారు. అయితే ఎయిర్‌పోర్టుకు భూములు ఇచ్చేందుకు రైతులు సానుకూలంగానే ఉన్నారు. కానీ, తమకు భూమికి బదులుగా మరో చోట భూమి కావాలని పట్టుబడుతున్నారు. వెటర్నరీ కాలేజీలో అదనంగా ఉన్న సుమారు 60ఎకరాల భూమిని రైతులు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్చలు జరిపింది. అయితే ఆ భూమి సాగుకు అనుకూలంగా లేని చౌడు నేల కావటంతో రైతులు విముఖత చూపుతున్నట్లుగా సమాచారం. ప్రత్యామ్నాయంగా భూమి లేకపోవటంతో నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఎకరానికి రూ.80లక్షలు చెల్లించేందుకు రైతులతో అనధికారికంగా చర్చలు జరిపారు. తమ భూములకు ప్రభుత్వం ధర కాకుండా బహిరంగ మార్కెట్‌లో ధరను చెల్లించాలని రైతులు పట్టుబడుతున్నారు. ఎయిర్‌పోర్టు వస్తుండటంతో ఈ ప్రాంతంలో ఎకరాకు రూ.1.50కోట్ల నుంచి రూ.2కోట్లకు పైగా ధర పలుకుతోందని, ఆ ధరనే తమకు చెల్లించాలని రైతులు పట్టుబడుతున్నారు. దీంతో 259ఎకరాలకు రూ.388.5కోట్ల నుంచి రూ.518కోట్లు నష్టపరిహారం కిందనే చెల్లించాల్సి వస్తుంది. ఇంత పెద్దమొత్తంలో రైతులకు నష్టపరిహారం ఇవ్వడం కుదరదని అధికారులు పేర్కొంటున్నారు. నష్టపరిహారంపై రైతుల డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. అయితే ప్రభుత్వం నుంచి రైతులకు చెల్లించే నష్టపరిహారంపై ఎలాంటి స్పష్టత రాకపోవటంతో ఎయిర్‌పోర్టు పనులకు ఆటంకం ఎదురవుతోంది. రైతుల నుంచి 259 ఎకరాలతో పాటు వెటర్నరీ కాలేజీకి చెందిన 40 ఎకరాల భూమి కూడా కలుపుకుని సుమారు 299 ఎకరాల భూమిని ఏఏఐకి కేటాయించాలని అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. దీంతో ఏఏఐ కావాల్సిన సుమారు వెయ్యి ఎకరాల భూమి కేటాయింపు పూర్తి అవుతుందని భావిస్తున్నారు.

ఎకరాకు రూ.2కోట్ల పరిహారం ఇవ్వాలి

- దండ నరేష్, గుంటూరుపల్లి, సంగెం మండలం, వరంగల్ జిల్లా



ఎయిర్‌పోర్టు కోసం భూములు ఇచ్చేందుకు అభ్యంతరం లేదు. కానీ, ఎయిర్‌పోర్టు కోసం భూములను త్యాగం చేస్తున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. బహిరంగ మార్కెట్‌లో ఈ ప్రాంతంలో ఎకరాకు రూ.2కోట్ల వరకు ధరలు ఉన్నాయి. అవే ధరలను భూములు కోల్పోతున్న రైతులకు చెల్లించాలి. అలాగే రైతు కుటుంబంలోని అర్హతలను బట్టి ఎయిర్‌పోర్టు ఉద్యోగావకాశాలు కల్పించాలి.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

తరిగొప్పుల, ఆగస్టు 23: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జాలుబాయితండాకు చెందిన సభావత్ సుమన్‌నాయక్(26)కు మూడు నెలల క్రితం వివాహమైంది. కొంతకాలానికి ఇద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడి భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన సుమన్‌నాయక్ శుక్రవారం ఉదయం వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి చనిపోయాడు. తండ్రి హాలుకు నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై శ్వేత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డెంగీతో యువకుడి మృతి

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 23: డివిజన్ కేంద్రంలోని బుడగ జంగాల కాలనీకి చెందిన కడమంచి కాలేష్ (31) అనే యువకుడు డెంగీ జ్వరంతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వారం రోజుల క్రితం అతడికి జ్వరం రాగా డివిజన్ కేంద్రంలో ఆస్పత్రిలో చికిత్సపొందాడు. జ్వరం తీవ్రత తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాడు. రెండు రోజులుగా అక్కడ చికిత్సపొందుతూ గురువారం అర్థరాత్రి మృతి చెందాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి..


కుంచాల రాజు (ఫైల్)

చిలుపూర్, ఆగస్టు 23: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణాజీగూడెంనకు చెందిన కుంచాల రాజు (37)కు పదేళ్ళ క్రితం వివాహమైంది. సంతానం కలుగకపోవడంతో మూడేళ్ళ క్రితం భార్య విడాకులు తీసుకొని వెళ్లిపోయింది. అప్పటి నుంచి మానసికంగా ఇబ్బంది పడుతున్న రాజు జీవితంపై విరక్తి చెంది గురువారం సాయంత్రం తన పొలం వద్ద క్రిమిసంహారక మందు తాగాడు. తల్లిదండ్రులు ఎంజీఎంకు తరలించగా, పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతిచెందాడు. తండ్రి బక్కయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 23: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న బైరపాక శోభ (45) అనే మహిళ శుక్రవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన డోలి రాజ్‌కుమార్ అనే యువకుడు ఈ నెల 20వ తేదీన బైక్‌పై వెళుతూ డివిజన్ కేంద్రంలోని అన్నపూర్ణ రైస్ మిల్లు సమీపంలో ముందు వెళుతున్న మోపెడ్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ధర్మసాగర్ మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన బైరపాక సుదర్శన్-శోభ దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి బైరపాక శోభ మృతి చెందింది. ఆమె కుమారుడు బైరపాక తరుణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డోలి రాజ్‌కుమార్‌పైన కేసు నమోదు చేసినట్లు సీఐ జి.వేణు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృత్యువాత


మృతిచెందిన పాడిగేదె వద్ద బాధిత రైతు సోంపెల్లి వెంకటస్వామి

చిలుపూర్, ఆగస్టు 23: పల్లగుట్ట పరిధి లోని మారెపల్లి గూడెంలో విద్యుదాఘాతంతో పాడిగేదె మృతిచెందింది. బాధిత రైతు సోంపెల్లి వెంకటస్వామి రోజు మాదిరిగానే శుక్రవారం తన గేదెలను మేపేందుకు పొలాల్లోకి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఆనుకుని ఉన్న సపోర్ట్ వైర్‌ను కొమ్ములతో రాకింది. ఈ క్రమంలో వైర్‌కు అనుసంధానంగా ఉన్న గైడ్ పగిలిపోయి విద్యుత్ షాక్‌తో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో తనకు రూ.1 లక్ష నష్టం జరిగిందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఎమ్మెల్యే పల్లాకు ఆహ్వానం

బచ్చన్నపేట, ఆగస్టు 23: త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవా సమితి-హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి బచ్చన్నపేట, రాంచంద్రాపూర్ గ్రామాల్లో నిర్వహించే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఆహ్వానించినట్లు సంస్థల ప్రతినిధులు శ్రీనాథ్ శ్రేష్టి, కొన్నె ఉపేందర్, అశోక్‌లు తెలిపారు. వారం రోజుల పాటు గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి అనంతరం ఊరేగింపులు జరుపుతామన్నారు.

మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వండి

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా


సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, ఆగస్టు 23: మహిళలు, చిన్నారుల భద్రతకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. శుక్రవారం కమిషనరేట్ కార్యాలయంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. స్టేషన్‌లలోని పెండింగ్ కేసులు, కేసు ప్రస్తుత స్థితిగతులు, నిందితుల అరెస్టుకు గల కారణాలు కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకు అధికారులు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తూ కిందిస్థాయి సిబ్బంది పనితీరు పర్యవేక్షించాలన్నారు. మహిళలు, పిల్లలపై నేరాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారు ఇచ్చిన ఫిర్యాదులపై స్పందిస్తూ బాధితులకు న్యాయం చేయాలని కమిషనర్ సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలు గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ట్రై సిటీస్ పరిధిలో ట్రిపుల్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌ను కట్టడి చేయాలన్నారు. సన్నిహిత నుంచి వచ్చే ప్రతీ ఫిర్యాదును స్టేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో దర్యాప్తు జరిపి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సెంట్రల్, వెస్ట్ జోన్ డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, అదనపు డీసీపీలు రవి, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

పిల్లల పార్కు సుందరీకరణకు రూ.2 కోట్లు

అభివృద్ధి పనుల ప్రారంభంలో ఎమ్మెల్యే నాయిని, ఎంపీ కావ్య


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని, ఎంపీ కడియం కావ్య

బాలసముద్రం, ఆగస్టు 23: హనుమకొండ బాలసముద్రంలోని పిల్లల పార్కును రూ.2 కోట్లతో అభివృద్ధి చేస్తామని హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డితో కలిసి వారు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 15వ ఆర్థిక సంఘం నిధులతో పార్కులో అంగవైకల్యం కలిగిన పిల్లలకు వసతిగృహం, ఆడిటోరియం నిర్మాణం, సుందరీకరణ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న రోజుల్లో హైదరాబాద్ హైడ్రా తరహాలో నగరంలోని అక్రమ కట్టడాల నిర్మూలనకు డీసీపీ స్థాయి అధికారిని వరంగల్‌లో నియమించబోతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నగరంలో ఉన్న భద్రకాళిబండ్, పద్మాక్షమ్మగార్డెన్, ఏకశిలాపార్కు, పబ్లిక్ గార్డెన్‌లలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాలని పోలీస్ వారికి ఆదేశాలు ఇచ్చామన్నారు.

ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి వరంగల్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, స్థానిక మాజీ కార్పొరేటర్ కేశిరెడ్డి మాధవిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్‌యాదవ్, నాయిని లక్ష్మారెడ్డి, బొంత సారంగం, వల్లపు రమేష్ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు రోబోటిక్స్‌పై అవగాహన


బచ్చన్నపేట ఆదర్శ పాఠశాలలో రోబోటిక్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



జనగామ సోషల్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థులతో సోహం అకాడమీ ప్రతినిధులు

బచ్చన్నపేట, ఆగస్టు 23: ఉత్తేజకరమైన ప్రపంచానికి విద్యార్థులను పరిచయం చేయటం, సృజనాత్మకమైన ఆలోచన నైపుణ్యాలను పెంపొందించటమే రోబోటిక్స్ ఇన్ అకాడమిక్స్ శిక్షణ ముఖ్య ఉద్దేశమని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. శుక్రవారం సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో రోబోటిక్స్‌పై ఆదర్శ పాఠశాలలో 8,9వ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు సరికొత్త సృష్టికి అవకాశం కల్పించటం కోసం వారిలో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీయటం శిక్షణ ఉద్దేశమని వివరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సహదేవ్, రాహుల్, సంతోష్, సాకేత్, ఉమ, శ్రావణి, భార్గవి, హర్షిత, కావ్య, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

జనగామ రూరల్: సోహం అకాడమీ అఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో రోబోటిక్స్ ఇన్ అకాడమిక్స్ నిర్వాహకులు శుక్రవారం జిల్లా కేంద్రంలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం వ్యవస్థాపకుడు కోమరగిరి సహదేవ్ మాట్లాడుతూ విద్యారంగంలో నూతనోదయాన్ని కల్పించాలనే లక్ష్యంతో విద్యార్థులకు రోబోటిక్స్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మూడేళ్ల నుంచి తెలంగాణ వ్యాప్తంగా 43,417 మందికి అవగాహన కల్పించామని వివరించారు.

'హరీశ్‌రావు రాజీనామా చేయాలి'

జనగామ రూరల్, ఆగస్టు 23: మాజీ మంత్రి హరీశ్‌రావు రాజీనామా చేసి తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు వేమళ్ల సత్యనారాయణ రెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, కంచె రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రుణమాఫీ చేసినందున ఇచ్చిన మాటకు కట్టుబడి హరీశ్‌రావు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సాంకేతిక లోపాలతో కొందరికి మాత్రమే రుణమాఫీ కాలేదన్నారు. వారి వివరాలు సేకరించేందుకు మండలానికి ఒక వ్యవసాయ అధికారిని నియమించారని, త్వరలో రైతులందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని అన్నారు. ఇప్పటికైనా హరీశ్, కేటీఆర్ తప్పుడు ప్రచారాలు మానుకోవాలన్నారు. సమావేశంలో జాయ మల్లేష్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

గంగతెప్పకు పూజలు


చెరువులో పూజలు చేస్తున్న మత్స్యకార్మికులు

లింగాలఘణపురం, ఆగస్టు 23: మండల కేంద్రంలోని పాతచెరువులో స్థానిక గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో మత్స్యకార్మికులు శ్రావణమాసం సందర్భంగా గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గంగతెప్పను చెరువులోకి వదిలారు. ఏటా సంప్రదాయబద్ధంగా నిర్వహించే గంగతెప్ప మహోత్సవంలో స్థానిక మత్స్యకార్మికులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి చెరువులు, జలాశయాలు నిండాలని గంగమ్మతల్లిని వేడుకున్నారు. కార్యక్రమంలో కొండయ్య, శ్రవణ్‌కుమార్, యాదగిరి, శ్రీశైలం, సాయిబాబా, రాజు, సాయిలు, సత్యనారాయణ, ఆకాష్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


పరిశుభ్రత పనులు చేయిస్తున్న ఎంపీడీవో

బచ్చన్నపేట, ఆగస్టు 23: ప్రతీ కుటుంబం తమ ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, రోగాలు దరిచేరకుండా జాగ్రత్త పడాలని ఎంపీడీవో మల్లిఖార్జున్ కోరారు. డ్రైడే సందర్భంగా శుక్రవారం తమ్మడపల్లిలో ఇంటింటికీ తిరిగి నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. గుంతల్లో మురుగునీరు నిలువ ఉండకుండా పూడ్చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నందున తగిన జాగ్రత్తలు పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే డెంగీ లాంటి ప్రమాదకర వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం బీఆర్ఎస్ నిరసన


కొడకండ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొడకండ్ల, ఆగస్టు 23: మండలకేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సింధె రామోజీ ఆధ్వర్యంలో శుక్రవారం రైతుమాఫీ కాని మండల రైతుల పక్షాన బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మంలకేంద్రంలో ర్యాలీ, బస్టాండు చౌరస్తాలో రాస్తారోకో, అమరవీరుల స్థూపం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతలకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉందన్నారు. కాంగ్రెస్ నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తూ ప్రతీ హామీని అమలు చేసేవరకు ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పేరం రాము, మేటి సోమరాములు, డి.వెంకటేశ్వరరావు, డి.ఎ. గాంధీనాయక్, జ్యోతి, ఆసిఫ్, చెంచు రాజిరెడ్డి, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్

దేవరుప్పుల, ఆగస్టు 23: దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెం గ్రామంలోని ప్రభుత్వ అసైన్డ్ భూములనుంచి కొందరు మట్టిని అక్రమంగా ట్రాక్టర్లలో తరలిస్తుండగా శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు సుదగాని శ్రీను, చింత వెంకటేశ్వర్లు, చింత సందీప్, ఎల్లబోయిన రమేష్‌లపై దేవరుప్పుల ఎస్సై సృజన్‌కుమార్ కేసు నమోదు చేసి తహసీల్దార్ హౌస్సేన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుకను, మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్తంభాలు ఏర్పాటు చేయాలని వినతి

రఘునాథపల్లి, ఆగస్టు 23: మండలంలోని మేకలగట్టు గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన బ్రిడ్జికి ఇరువైపులా ఎత్తయిన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి మేకలగట్టు గ్రామస్థులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని మాజీ ఎంపీటీసీ బానోతు బిక్షపతి నాయక్ తెలిపారు.

'మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి'

రఘునాథపల్లి, ఆగస్టు 23: మహిళ సంఘాల సభ్యులు స్వయం శక్తితో అభివృద్ధి సాధించాలని మండల పశు వైద్యాధికారి అశోక్ అన్నారు. కంచనపల్లి ప్రియదర్శిని మహిళ సంఘం సభ్యులకు మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రైతు వేదిక భవనంలో పాడి పశువులు, పెరటి కోళ్ల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ మాట్లాడుతూ మహిళలు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొని అదనపు ఆదాయపు వనరులను అందుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం సారయ్య, సీసీ సంపత్, లలిత, నిర్మల, విజయ, సుజాత, వసంత, రాజేశ్వరి, లావణ్య, జ్యోతి, ఐలేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం ఎంపీకి వినతి

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 23: ఛాగల్ గ్రామంలో జాతీయ రహదారిపై నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ గడ్డె అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం వరంగల్ ఎంపీ కడియం కావ్యకు వినతి పత్రం అందించారు. ఛాగల్ గ్రామంలో జాతీయ రహదారిపై లైట్లు లేకపోవడంతో రాత్రివేళలో ఇబ్బంది అవేతోందని. గ్రామ శివారులోని దేవాదుల కెనాల్ సమీపంలో యూటర్న్ వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయించాలని కోరారు. యూటర్న్ వద్ద చీకటిగా ఉండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా ఛాగల్ బీసీ కాలనీ ఎదురుగా యూటర్న్‌ను ఏర్పాటు చేయించాలని ఎంపీని కోరగా సానుకూలంగా స్పందించి త్వరలోనే ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడి యూటర్న్, హైమాస్ట్ లైట్ల ఏర్పాటు విషయమై కృషి చేస్తానని కావ్య హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చేపూరి ప్రభాకర్, ఆకుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనకు నిరసనగా ర్యాలీ

దేవరుప్పుల, ఆగస్టు 23: కోల్‌కతా అమానవీయ ఘటనకు నిరసనగా శుక్రవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి ర్యాలీ బయలుదేరి దేవరుప్పుల చౌరస్తా వరకు చేరుకుని అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి కోలెపాక భాస్కర్ మాట్లాడుతూ స్త్రీని దైవంలా భావించే భారతదేశంలో కోల్‌కత్తా లాంటి ఘటనలు జరుగటం సిగ్గుచేటన్నారు. సమాజంలో యువత డ్రగ్స్, అల్కాహాల్‌కు అలవాటు పడకుండా వారిని సరైన మార్గంలో నడిపే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు చైతన్య, రాధిక, రహిమున్నీసా, హరితకుమారి, రవీందర్, శ్రీనివాస్, భవానీ. సుమ తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణమాదిగను కలిసిన ఈజీఎస్ డైరెక్టర్


మంద కృష్ణమాదిగకు శుభాకాంక్షలు తెలుపుతున్న అందె యాకయ్య

కొడకండ్ల, ఆగస్టు 23 : మంద కృష్ణమాదిగను మండలకేంద్రానికి చెందిన ఈజీఎస్ స్టేట్‌డైరెక్టర్ అందె యాకయ్య శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత మొదటిసారి శుక్రవారం హైదరాబాద్ విచ్చేసిన ఎంఆర్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగను ఆయన నివాసంలో కలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. మాదిగలను ఏకతాటిపైకి తెచ్చి గత 30 ఏండ్లుగా పట్టువదలకుండా చేసిన సుదీర్ఘ పోరాటం ఆయన చేశారని అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అనుకూలంగా రావడం కోసం మంద కృష్ణమాదిగ చేసిన కృషిని మాదిగలు ఎవరూ మరవరు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ, అందె సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలి


పాలకుర్తిలో సమావేశంలో మాట్లాడుతున్న సాయిలు

పాలకుర్తి, ఆగస్టు 23: ఏకలవ్య కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఎరుకల హక్కుల పోరాట సమితికే ఇవ్వాలని ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరాయ సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ ఎరుకల హక్కుల పోరాట సమితిలో పనిచేసే ప్రతీ కార్యకర్త త్యాగాలు చేస్తున్నారని అన్నారు. ఎరుకల జాతికి జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి ఏకలవ్యున్ని, నాంచారమ్మ చరిత్ర వెలుగులోకి తెచ్చింది ఎరుకల హక్కుల పోరాట సమితి అని అన్నారు. అందుకోసమే ఎరుకల కోఅపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఎరుకల హక్కుల పోరాట సమితి నాయకత్వానికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు అంగిడి ఎల్లయ్య, సోమనర్సయ్య, మానుపాటి అశోక్, అంగిడి కృష్ణ, రాంచందర్, మల్లమ్మ, కొంరయ్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్‌వోను కలిసిన రైస్ మిల్లర్స్


డీఎస్‌వో సరస్వతికి పుష్పగుచ్ఛం అందిస్తున్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 23: జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి (డీఎస్‌వో)గా నూతనంగా విధుల్లో చేరిన సరస్వతిని శుక్రవారం ఆమె కార్యాలయంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న ఆధ్వర్యంలో అసోసియేషన్ బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు సిద్దిరాజు, పెండ్లి సంపత్, చేగొండ నరహరి, బొగ్గరపు నాగరాజు, అయిత సిద్దినర్సయ్య, రాజిరెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ కరపత్రాల ఆవిష్కరణ


కస్తూర్బా పాఠశాలలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది

పాలకుర్తి, ఆగస్టు 23 : ఈ నెల 30న హైదరాబాద్‌లోని స్కూల్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు సంబంధించి కరపత్రాలను శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో నాన్ టీచింగ్ సిబ్బంది భారత కార్మిక సంఘాల సమైక్య తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర నాయకుడు కొత్తపల్లి రవి మాట్లాడారు. బోధనేతర సిబ్బంది వయసు 65 ఏళ్లకు పెంచాలని, పదవీ విరమణ పొందిన వారికి రూ. 5 లక్షలు ఇవ్వాలని, రూ. 18 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తొర్రూరు ఏరియా కమిటీ కార్యదర్శి ఎండి.షరీఫ్, పద్మ, సుమలత, లక్ష్మీ, లత పాల్గొన్నారు.

సైనికుల సేవలు మరువలేనివి


సైనికులను సన్మానిస్తున్న పీఎంఈఎస్ నాయకులు

జనగామ రూరల్, ఆగస్టు 23: దేశ రక్షణ కోసం సైనికులు ప్రాణాలను పణంగా పెట్టి అందిస్తున్న సేవలు మరువలేనివని పారా మిలటరీ ఎంప్లాయిస్ సొసైటీ (పీఎంఈఎస్) జనగామ జిల్లా అధ్యక్షుడు డేగల సంపత్ అన్నారు. పదవి విరమణ పొందిన సైనికులు ఎం. ప్రకాశ్, పి.కిరణ్ కుమార్ లను శుక్రవారం వారు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ దేశ భద్రత కోసం సైనికులు చేసిన త్యాగలను మాటాల్లో వర్ణించలేమన్నారు. కార్యక్రమంలో ఉడుత మహేందర్, అజ్మీరా రమేష్, వేల్పుల కిరణ్ కుమార్, ఎన్. సుధాకర్, జీ. అనిల్, నాగరాజులు పాల్గొన్నారు.